ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట

- క్యాన్సర్ వ్యాధిని అరికట్టేందుకు ఇంటింటా సర్వే
- 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరిపై దృష్టి
- ప్రాథమిక లక్షణాలు గుర్తించి వైద్య పరీక్షలకు సిఫారసు



నిడదవోలులో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నిడదవోలు: ప్రస్తుత సమాజంలో చాపకింద నీరులా క్యాన్సర్ వ్యాధి వ్యాపిస్తోంది. దీంతో పాటు మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ క్యాన్సర్ మహమ్మారిని అరికట్టేందుకు ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. క్యాన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్‌తో సాధ్యం కార్యక్రమం పేరుతో వైద్య, ఆరోగ్య సిబ్బంది నిడదవోలు నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వైద్య సిబ్బందితోపాటు ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటున్నారు. ఈ సమాచారాన్ని నిక్షిప్తం చేయడానికి రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న సర్వేలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి 18 ఏళ్లు నిండిన వ్యక్తికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్యశాఖ సర్వే ప్రకారం క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల అధిక మరణాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మహమ్మరిని పూర్తిస్థాయిలో అరికట్టాలంటే ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక దశలోనే వ్యాధి లక్షణాలు గుర్తించడం ద్వారా క్యాన్సర్ బాధితుల మరణాల సంఖ్యను తగ్గించచ్చునని నిపుణులు చెబుతున్నారు. ప్రజలకు అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళల్లో పలు రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. నిడదవోలులోని రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో 18 ఏళ్లు పైబడిన వారు 32,000 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకూ 27,000 మందికి ఇంటింటి సర్వేలో భాగంగా వైద్య పరీక్షలు చేశారు. ఇంకా 5 వేలమందికి స్క్రీనింగ్ పరీక్షలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ ఒక్క క్యాన్సర్ కేసు నిర్ధారణ కాలేదు.

స్క్రీనింగ్ పరీక్షలు

ఇంటింటా సర్వేలో భాగంగా ఒక వ్యక్తిలో క్యాన్సర్ కణాలను శోధించడాన్నే క్యాన్సర్ స్క్రీనింగ్ అని పిలుస్తారు. ఆ వ్యక్తిలో క్యాన్సర్ ప్రభావిత లక్షణాలు ఉన్నాయో లేదో ఆరోగ్య శాఖ సిబ్బంది పరిశీలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రస్తుతం పట్టణాలు గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ లక్షణాలున్న వ్యక్తులను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తారు.

ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య వివరాల సేకరణ

సర్వేలో భాగంగా వ్యక్తిగత వివరాలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు మరే ఇతర వ్యాధులు ఉన్నాయా, లేదా అని ఆరా తీస్తున్నారు. గతంలో సంక్రమించిన వ్యాధులు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. చెడు అలవాట్లపై ఆరా తీస్తారు. మహిళల్లో సంక్రమించే రొమ్ము, గర్భాశయం లక్షణాలను గుర్తిస్తారు. ప్రతి ఇంటి వద్దకు ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని యాప్ ద్వారా వివరాలు నమోదు చేస్తారు. పలు లక్షణాలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ ప్రాథమికంగా అంచనా వేస్తారు. ఈమేరకు ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముందుగా అవగాహన కల్పిస్తారు.

క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన సంపూర్ణమైన పోషకాహారం తీసుకోవాలి. ప్రతిరోజు వ్యాయామం చేస్తూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. గుట్కా, ఖైనీ, తంబాకు, పాన్ వంటివి నమలకూడదు. మద్యం సేవించరాదు. సురక్షితమైన లైంగిక విధానాలు పాటిస్తూ, బహుళ లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలి. తల్లిపాలు ఇవ్వకపోవడం లేదా తక్కువ కాలం ఇవ్వడం వల్ల, ఎక్కువ కాలం గర్భ నిరోధక మాత్రలు వాడటం వల్ల, మహిళల్లో 55 ఏళ్లు దాటిన తరువాత రుతుచక్రం ఆగిపోవడం వల్ల, కొన్ని సందర్భాల్లో జన్యుపరంగా రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

సర్వేకి సహకరించాలి



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై ఎలాంటి అపోహలు వద్దు. ఇంటింటికీ వస్తున్న ఆరోగ్య సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. స్క్రీనింగ్ పరీక్షలతో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. ఎక్కువగా మహిళలు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లతో బాధపడుతున్నారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చు.

– డాక్టర్ తేజశ్రీ, నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్, నిడదవోలు

గుల్ల పొగాకు కొనుగోలు చేయండి

- టుబాకో బోర్డు చైర్మన్‌కు రైతుల విజ్ఞప్తి
- కొనుగోళ్లను పరిశీలించిన యశ్వంత్ కుమార్



దేవరపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్

దేవరపల్లి: వేలం కేంద్రాల్లో వర్జీనియా పొగాకు కొనుగోళ్లు మందకొడిగా జరుగుతున్నాయని, రైతుల వద్ద ఉన్న అన్ని రకాల గ్రేడులను కొనుగోలు చేయడం లేదని దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం రైతులు టుబాకో బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్ దృష్టికి తీసుకుని వచ్చారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. తొలుత రైతులతో సమావేశం నిర్వహించి, మార్కెట్ సంక్షోభం గురించి వివరించారు. రైతులు మాట్లాడుతూ, పొగాకు కొనుగోళ్లు ప్రారంభమై నెల రోజులు కావస్తోందని, మొదటి నాలుగు రెలుపుల పొగాకు కొనుగోలుకు కొనుగోలుదారులు ముందుకు రావడం లేదని, ఐదో రెలుపు నుంచి కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. మొదటి ఐదు రెలుపుల పొగాకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు సుంకవల్లి శ్రీనివాస్, సింహద్రి ధర్మావతారం, కరుటూరి శ్రీనివాస్, నరహరిశెట్టి రాజేంద్రబాబు, కాట్రు సత్యనారాయణ తదితరులు వివరించారు. గట్టి పొగాకు, గుల్ల పొగాకుకు ఒకే ధర పలకడం వల్ల కొనుగోలుదారులు గుల్ల పొగాకు కొనుగోలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్జీనియా (ఎస్ఎల్ఎస్) పొగాకు కిలో గరిష్ట ధర రూ.290 ఉన్నప్పటికీ రూ.260 నుంచి రూ.280 మధ్య కొనుగోలు చేస్తున్నారని వాపోయారు. మార్కెట్లో పోటీ లేక ధర పెరగడం లేదని చెప్పారు. కిలో ధర రూ.320 ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెట్టుబడులు, భూముల కౌలు, బ్యారన్ల అద్దె రెట్టింపు అయినందున గిట్టుబాటు ధర ఇచ్చి ఒడ్డున పడేయాలని విజ్ఞప్తి చేశారు. బ్యాంకుల్లో బ్యారన్‌కు రూ.11 లక్షల వరకూ రుణం తీసుకున్నామని, రోజుకు రూ.1,000 వడ్డీ చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. కొనుగోలుదారులందరినీ వేలం కేంద్రాలకు తీసుకువచ్చి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. గిట్టుబాటు ధర రాకపోవడంతో వేలానికి బేళ్లు తీసుకురావడం లేదని తెలిపారు. బేళ్ల సంఖ్య పెంచాలంటే గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోజుకు 200 బేళ్లు అమ్మకానికి తీసుకు వస్తే వాటిలో 70 కూడా అమ్ముడుపోవడం లేదని చెప్పారు. తొర్రేడు ప్రాంత బ్లాక్ సాయిల్ (బీఎస్) పొగాకు రైతుల ప్రతినిధి కాట్రగడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ, తొర్రేడు ప్రాంతంలో 3.4 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చినప్పటికీ 3.2 మిలియన్లకు మించి ఉత్పత్తి కావడం లేదని తెలిపారు. ఒంగోలు ప్రాంతంలో పండించిన బ్లాక్ సాయిల్ పొగాకు కిలో రూ.280 పలుకుతోందని, ఇక్కడి పొగాకుకు రూ.260 మాత్రమే వస్తోందని చెప్పారు. అక్కడి మాదిరిగానే ఇక్కడ కూడా ధర ఇవ్వాలని కోరారు. యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ, కిలో ధర రూ.300 పైగా ఉండేలా కృషి చేస్తానని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్‌పై వర్జీనియా పొగాకు ధర ఆధారపడి ఉంటుందని చెప్పారు. వేలం కేంద్రాలకు ఎక్కువ సంఖ్యలో బేళ్లు అమ్మకానికి తీసుకు రావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కర్ణాటకలో పొగాకు వేలం ఆలస్యంగా ముగియడంతో ఇక్కడి మార్కెట్‌కు కొనుగోలుదారులు పూర్తి స్థాయిలో రావడానికి సమయం పడుతుందని చెప్పారు. ఎస్ఎల్ఎస్ రైతులు పంట నియంత్రణ పాటించారని అన్నారు. సమావేశంలో బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్, వేలం నిర్వహణాధికారి పి.హేమస్మిత తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మార్కెట్లో తగ్గిన పొగాకు డిమాండ్

దేవరపల్లి: మనకు పోటీగా ఉన్న దేశాల్లో పంట ఎక్కువగా పండినందున అంతర్జాతీయ మార్కెట్లో మన పొగాకుకు డిమాండ్ తగ్గిందని టుబాకో బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్ అన్నారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మన రాష్ట్రంలో పండిస్తున్న పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి గుర్తింపు ఉందన్నారు. గత ఏడాది బ్రెజిల్, జింబాబ్వే వంటి పోటీ దేశాల్లో పొగాకు ఉత్పత్తి తగ్గినందున మన పొగాకుకు డిమాండ్ ఏర్పడి కిలో రూ.400 పలికిందన్నారు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదని వివరించారు. పొగాకు ధర ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడి ఉంటుందని, దీంతో మార్కెట్ కాస్త ఒడుదొడుకులుగా ఉందని తెలిపారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ధర వస్తుందని రైతులు సహజంగా అనుకుంటారని, కానీ డిమాండ్ అలా ఉండదని అన్నారు. ఖర్చులు పోను రైతులకు వీలైనంత లాభదాయకమైన ధర అందించేందుకు బోర్డు కృషి చేస్తుందని చెప్పారు. మన రాష్ట్రంలో 2024-25 పంట కాలంలో ఎక్కువ ఉత్పత్తి జరిగిందన్నారు. రాష్ట్రంలో 167 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తికి అనుమతి ఉండగా, 240 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. దీనిని వీలైనంత త్వరగా అమ్ముకోవడం ప్రధాన లక్ష్యమని యశ్వంత్ కుమార్ చెప్పారు. కర్ణాటకలో పొగాకు మార్కెట్ అనిశ్చిత పరిస్థితిలో ఉందని, గత ఏడాది ఇక్కడ ఇచ్చినట్టుగా రూ.400 ధర ఇవ్వాలని అక్కడి రైతులు డిమాండ్ చేస్తున్నారని, వారు చాలా కాలం బేళ్లు తక్కువగా తీసుకు రావడంతో కొనుగోళ్లు నెల రోజులు ఆలస్యమయ్యాయని, ఆ ప్రభావం ఇక్కడి మార్కెట్‌పై పడిందని వివరించారు. ఎగుమతి సంస్థలకు ఆర్డర్లు ఖరారైన తర్వాత కొనుగోలు సంస్థలు ఇక్కడి మార్కెట్లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. కొనుగోలు సంస్థలతో ఇప్పటికే చర్చించామన్నారు. బాడవ భూముల్లో పొగాకు పండించి, అంతర్జాతీయంగా ఎస్ఎల్ఎస్ పొగాకుకు ఉన్న విశిష్టతను పోగొట్టుకోవద్దని ఆయన రైతులకు సూచించారు. వేలం నిర్వహణాధికారి పి.హేమస్మిత మాట్లాడుతూ, మొదటి రెలుపుల పొగాకు ఐటీసీ తప్ప మిగిలిన సంస్థలు కొనుగోలు చేయడం లేదని చెప్పారు. దీంతో, మార్కెట్లో పోటీ లేదని అన్నారు. ప్రస్తుతం వేలం కేంద్రానికి తక్కువ బేళ్లు వస్తున్నాయని, కనీసం 500 బేళ్లు వస్తేనే క్లస్టర్ వారీగా వేలం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్, వేలం కేంద్రం రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాట్రు వీర వెంకట సత్యనారాయణ, రైతు సంఘం ప్రతినిధులు నరహరిశెట్టి రాజేంద్రబాబు, దుద్దుపూడి హరిబాబు, యాగంటి వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాసరావు, కాట్రు భీమరాజు, తొర్రేడు ప్రాంత రైతు సంఘం ప్రతినిధి కాట్రగడ్డ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా విద్యార్థుల నమోదులు



పోతవరంలో బడిబాట కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ గోపి గోవర్ధన్,ఉపాధ్యాయులు

నల్లజర్ల: వ్యక్తి వికాసానికి, సమాజ మార్పునకు పునాదులు ప్రభుత్వ పాఠశాలలని పోతవరం క్లస్టర్ కాంప్లెక్స్ చైర్మన్ గోపి గోవర్ధన్ తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల నమోదు, తరగతి ఉన్నతుల ప్రక్రియపై ఉపాధ్యాయలంతా గ్రూపులుగా గ్రామంలో తల్లిదండ్రులను కలుసుకుని పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలలు చక్కని సదుపాయాలతో ఆధునిక పద్ధతులతో పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడే నిలయాలుగా ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫాం, బూట్లు, బెల్ట్, బ్యాగు, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాలను వివరించారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానంతో ప్రయోజనాలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, శతశాతం ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, మోడల్ పాఠశాలల ప్రగతిపై వివరించారు. పోతవరంతో పాటు సుభద్రపాలెం, కిష్టాయిగూడెంలలో ఈ కార్యక్రమం సాగింది. ఉపాధ్యాయులతో పాటు సీఆర్‌పీ శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు.

చోరీలను అరికట్టేందుకు చర్యలు



చివటంలో ఎల్‌హెచ్ఎంఎస్‌పై ఆటోలో ప్రచారం నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ఉండ్రాజవరం: తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలను అరికట్టడానికే లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ని పోలీస్‌శాఖ ప్రవేశపెట్టినట్టు ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో చివటంలో టీచర్స్ కాలనీలో ఎల్‌హెచ్ఎంఎస్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవి సెలవుల్లో దూర ప్రాంతాలకు వెళుతున్న మండల ప్రజల ఇళ్ల వద్ద పోలీస్ శాఖ ద్వారా ఉచిత భద్రత ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ప్రజలు గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు పోలీసు శాఖ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదైన అనంతరం పోలీస్ శాఖ ద్వారా దరఖాస్తు చేసినవారి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈవిషయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎక్కువ రోజుల పాటు బయటి ప్రాంతాలకు వెళ్లే ఇంటి యజమానులు తమ విలువైన వస్తువులను లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. బయటి ప్రజలకు కనిపించకుండా ఇంటికి తాళం వేసుకోవాలన్నారు. సమాచారం కోసం ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 08819-234433ని సంప్రదించాలన్నారు.

దళితుల సాంఘిక బహిష్కరణపై నిరసన



నిడదవోలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

నిడదవోలు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని పల్లాం గ్రామంలో దళితుల సాంఘిక బహిష్కరణ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం రాత్రి వివిధ దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితులు కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు ఉసురుమర్తి సూరి, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజులు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో దళితులను గ్రామ బహిష్కరణ చేయడం అన్యాయమన్నారు. దీనిపై పవన్ కల్యాణ్ స్పందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం తక్షణమే గ్రామ బహిష్కరణకు కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు, కౌన్సిలర్ దాకే అనిల్‌కుమార్, విపర్తి కిషోర్ పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు వెంకటేశ్వరరావు

దళితులంటే చులకనా ?

నల్లజర్ల: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని మల్లాం గ్రామంలో దళితులను సాంఘిక బహిష్కరణకు చేయడంపై వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నల్లజర్ల మండల అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరావు మండిపడ్డారు. దళితులంటే అగ్రవర్ణాలకు మరీ ఇంత చులకనా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం ఆయన నల్లజర్లలో విలేకర్లతో మాట్లాడారు. చిన్న కారణానికి సాంఘిక బహిష్కరణకు గురిచేయడం తగదన్నారు. ఆ గ్రామంలో పల్లపు సురేష్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందితే అతని భార్య, ఇద్దరు పిల్లలను ఆదుకోవాలని ఆందోళన చేయడమే వారు చేసిన నేరమా అని అందుగుల ప్రశ్నించారు. సురేష్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

కొవ్వూరు: ఏరినమ్మ ఘాట్‌కి దిగువ రోడ్డులోని ఓ షెడ్డులో వాలిశెట్టి రాంబాబు (రాము) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమార్తె జగ్గంశెట్టి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేసినట్లు సీఐ విశ్వం తెలిపారు. వివరాల్లోకి వెళితే ఏడేళ్ల నుంచి రాము (57) తన భార్యకు దూరంగా ఉంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాము అనారోగ్యానికి గురవడంతో అతని పెద్ద కుమార్తె, అల్లుడు కలసి ఆసుపత్రికి తీసుకెళ్లారు.ఆ సమయంలో బీపీ అధికంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. చికిత్స అనంతరం కొవ్వూరు పట్టణ శివారున వాంబే కాలనీ సమీపంలో ఉన్న ఇంటి వద్ద వారు దింపినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. అనంతరం రాము ఉరి వేసుకుని ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతదేహం పూర్తిగా పాడై ఉందని చెబుతున్నారు. శనివారం రాత్రి రాము ఉరి వేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు, పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు న్నారు. తన తండ్రి పలు రకాల అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నట్లు కుమార్తె ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగానే రాము ఉరి వేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

46 మందికి కంటి వైద్య పరీక్షలు

పెరవలి: స్వచ్ఛంద సంస్థలు అందించే సేవలు సద్వినియోగం చేసువాలని సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి శ్రీనివాస్ తెలిపారు. పెరవలి మండలం కాకరపర్రులో స్కోజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి జి.ఆజోర్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో 46 మందికి పరీక్షలు నిర్వహించామని ఇందులో 12 మందికి శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉందని, 16 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించినట్టు తెలిపారు. మందులు ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు కళ్లజోళ్లు రాయితీపై అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీతం నాగేశ్వరరావు, పెనుమత్స మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉపాధి

గోపాలపురం: విద్యతోనే ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 6వ తరగతిలో చేరిన సుమారు 100 మంది విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల విద్యాశాఖాధికారి జి శ్రీనివాసరావు, ఏ మహేశ్వరరావు, కాంప్లెక్స్ చైర్మన్ కె. సోమశేఖర్, పైడి సురేష్‌బాబు, బోడ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

భూముల కౌలు హక్కుకు బహిరంగ వేలం

దేవరపల్లి: మండలం త్యాజంపూడిలోని జిల్లాలోని రాజానగరంకు చెందిన రాజా కాంద్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ అన్నదాన సత్రము(శ్రీ ఫీడిగ్ సత్రం) హక్కు భుక్తంలో గల సర్వే నెంబరు 387/1, 378/1లోని 12.93 ఎకరాలు, సర్వే నెంబరు 278/2లో 2 ఎకరాలు, సర్వే నెంబరు 385లో 3 ఎకరాలు, మొత్తం 17.93 ఎకరాల భూములను మూడు బిట్లుగా ఈ నెల 24న ఉదయం 11 గంటకు త్యాజంపూడి గ్రామ సచివాలయం వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరం నుంచి 2027-28 సంవత్సరం వరకు మూడు సంవత్సరాల కాల పరిమితికి కౌలు హక్కులకు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనేవారు ఆధార్ కార్డు, సాల్వెన్సీ అందజేసి ప్రథమ ధరావత్తు చెల్లించాలని ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు ఇతర వివరాలకు 99591 62498 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

చాగల్లు: విపత్తులపై సరైన అవగాహన కలిగి ఉండి, అప్రమత్తంగా వ్యవహరిస్తే నష్టాలను తగ్గించవచ్చని ఈవోపీఆర్డీ ఆర్.శ్రావణ కుమార్ అన్నారు. ఎస్.ముప్పవరం గ్రామ పంచాయతీలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ విస్తరణాధికారి, రిసోర్స్ పర్సన్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి వివిధ శాఖల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి సిబ్బందికి ప్రకృతి వైపరీత్యాలు సంబవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను అందజేశారు.

చిరుధాన్యాల సాగుతో భూసారం వృద్ధి

కొవ్వూరు: సార్వా, దాళ్వా వరి పంట తర్వాత రాగి, కొర్రలు వంటి చిరుధాన్యాలు సాగు చేయడం లాభదాయకమని ఏరువాక కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు సూచించారు. దొమ్మేరు రైతు సేవా కేంద్రంలో సోమవారం చిరుధాన్యాల సాగు ఆవశ్యకతపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకి పెట్టుబడి వ్యయం, చీడపీడల తాకిడి తక్కువగా ఉంటాయన్నారు. ఒక ఎకరా వరికి కావాల్సిన నీటితో ఐదెకరాల చోడి పంట సాగు చేయవచ్చునన్నారు. ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ కేవలం 70 నుంచి 85 రోజుల వ్యవధిలో వేసవిలో పంట చేతికి అందుతుందన్నారు. ఎకరాకు నికర ఆదాయం రూ.20వేలు వస్తుందన్నారు. వేసవిలో అపరాల సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీ ఎ.జయరామలక్ష్మి, సర్పంచ్ తానేటి కుమారి, మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.గంగాధరరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

చాగల్లు: నవంబర్‌లో నాలుగు రోజుల పాటు అనంతపురం జిల్లా హిందూపూర్‌లో నిర్వహించిన అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో చాగల్లు విద్యార్థిని రాయుడు ప్రవల్లిక పాల్గొని నాలుగో స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. జాతీయ స్థాయి పోటీలు ఏప్రిల్ 26 నుంచి నాలుగు రోజుల పాటు మహారాష్ట్రలో జరగనున్నాయన్నారు. ఏప్రిల్ 23 ఉదయం హిందూపూర్‌లో రిపోర్ట్ చేయాలని అండర్-14 ఏపీ టీం మేనేజర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ప్రవల్లికను ఎస్ఎంసీ చైర్మన్ గోపాలకృష్ణ, హెచ్ఎం మోహన్ కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మిని, గ్రామస్తులు అభినందించారు.

పగలే వెలుగులు



ఖండవల్లిలో పట్టపగలే వెలుగు విరజిమ్ముతున్న వీధిదీపాలు

పెరవలి: విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని ఒకవైపు ప్రజలు గగ్గోలుపెడుతున్నారు. మరో వైపు విద్యుత్ సరఫరా అవుతున్న సమయంలో పగలూ రాత్రి తేడాలేకుండా వీధి దీపాలను వెలిగిస్తూ పంచాయతీ సిబ్బంది కరెంట్ వృథా చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పెరవలి మండలంలో మేజర్ పంచాయతీ ఖండవల్లిలో సోమవారం వీధిలైట్లు పట్టపగలే వెలుగులు విరజిమ్ముతున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారిలో వీధిలైట్లు వెలుగుతున్నా అధికారులు పట్టించుకోకుండా వదలివేయడం ఏమిటని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు.

వీవోఏ అక్రమాలపై డ్వాక్రా సభ్యుల ఫిర్యాదు

నిడదవోలు రూరల్: రుణాలు కావాలంటే వీవోఏకు కమిషన్ ఇవ్వాల్సి వస్తోందని పలువురు డ్వాక్రా సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నిడదవోలు మండలం గోపవరానికి చెందిన వీవోఏ ఎం.లలిత అక్రమాలపై అదే గ్రామానికి చెందిన డ్వాక్రా సభ్యులు ముప్పిడి దివ్య, బంగారమ్మ, రామలక్ష్మి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో గోపవరం పంచాయతీ కార్యాలయం వద్ద డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు స్త్రీనిధి జనరల్ మేనేజర్ ధర్మేంద్ర, ఉన్నతి పథకం డీపీఎం త్రిమూర్తులు, ఏపీఎం ఈడూరి మహాలక్ష్మి సోమవారం విచారణ చేపట్టారు. ఉన్నతి వడ్డీలేని రుణం రూ.50 వేలు తీసుకుంటే ఇప్పటికే రూ.2,500 చొప్పున 24 నెలలు చెల్లించినా ఇంకా బాకీ తీరలేదంటూ వీవోఏ లలిత ఇబ్బంది పెడుతోందని డ్వాక్రా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్వాక్రా, స్త్రీనిధి రుణాలు కోసం కమిషన్లు ఇస్తేనే వీవోఏ బ్యాంకర్లతో మాట్లాడి మంజూరు చేయిస్తుందని ఫిర్యాదు చేశారు. ఉన్నతి రుణాలు ఎక్కువ చెల్లించిన సభ్యుల డబ్బులను వీవోఏ లలిత వద్ద రికవరీ చేయాలని కోరారు. డ్వాక్రా సభ్యుల అభిప్రాయాలను సేకరించి డీఆర్‌డీఏ పీడీకి నివేదిస్తామని అధికారులు తెలిపారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.పుష్పవతి, స్థానిక నాయకులు తాతపూడి నాగేశ్వరరావు, ఆరేపల్లి చిననంగాలు, జగదీష్ ఉన్నారు.

సూపర్ సిక్స్ హామీల అమలు చేయాలని ధర్నా

కొవ్వూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రగతి శీల మహిళ సంఘం నాయకురాలు ఈమని మల్లిక మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని, మొదటి ఏడాది బకాయిలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలన్నారు. మద్య నిషేధం అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం దుర్మార్గమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు శ్రీనివాస్, పీడీఎస్‌యూ మహర్షి, కాంగ్రెస్ పార్టీ నేత సాకా పుల్లారావు పాల్గొన్నారు.